# నాగకన్య

రాజా

ఆ అమ్మాయి నడుస్తూ నడుస్తూ తూలి పడిపోతోంది. ఆమె వెనకాతలే గోపాలరావు రెండు మూడడుగులు వేశాడు. ఇంతట్లోకే ఆ అమ్మాయి తలప్రక్కకి ఒరిగిపోయింది. చటుక్కున గోపాలరావుకి ఆమె మూర్ఛపోతుందేమో అనే అనుమానం కలిగి ఆమె దగ్గరకి పరిగెత్తుకుని వెళ్లాడు. వెళ్ళాడో లేదో, ఆమె గిర్రున తిరిగి పడిపోబోయింది. గోపాలరావు ఆమెను చేతుల్లో పట్టుకున్నాడు. ఎవరూ చూపుమేర మార్గంలో లేరు. సహాయం చేస్తారేమో అంటె. అంచేత తనయిల్లు దగ్గర్లోనే ఉండడం చేత ఆమెని బుజంమీద మోసుకొని యింట్లోకి తీసుకెళ్ళాడు.

అప్పుడతను ఆమెని ఒక కుర్చీలో కూలబెట్టాడు. ఆమె వరిగిపోయింది. ఇంకా కళ్లు తెరవలేదు. అంచేత ఖంగారుగా కోటు కుర్చీకి తగిలించి, కాసిని చన్నీళ్ళు తేవడానికని పరుగెత్తాడు.

నీళ్ళు తెస్తూవుంటే అతన్ని హఠాత్తుగా ఒక భయం ఆవరించింది. అతని భార్య బజారుకి వెళ్ళింది ఇప్పుడు తను ఒంటరిగా ఇంకొక అమ్మాయితో ఉన్నాడు. ఇంక పుకార్లకి లోటేమిటి? తన భార్య కీసంగతి తెలిసిందంటే తనని బ్రతుకనిస్తుందా? ఈ ఆలోచనలతో తట్టుమిట్టాడుతూ నీళ్ళు ఆమెదగ్గరికి తీసికెళ్ళాడు.

యింతట్లోకే ఆమె లేచి, గదిఅంతా తచ్చాడుతోంది. గోపాలరావుని చూసి ఆశ్చర్యంగా, "నేనిప్పుడెక్కడున్నాను?" అని అడిగింది. గోపాలరావు తెలివి తప్పిపోయిన సంగతి యావత్తూ చెప్పాడు.

"ఆఁ? తెలివి తప్పిపోయానా?" అని ఆశ్చర్యంగా అడిగింది ఆమెముఖం అంతా అలసటగా ఉంది, పెదిమలు తడి ఆరిపోయి ఉన్నాయి. ఇంతా చూసి గోపాలరావు, "కాస్త కాఫీ తాగుతారా? కాస్త అలసట తగ్గుతుంది" అన్నాడు.

"నేనీవాళ పచ్చిమంచినీళ్ళయినా తాగలేదు. ఈవాళ ఎలాగయితేనేం మావారితో దెబ్బలాడి వచ్చేశాను. మంగళసూత్రం కూడా తెంపేసివచ్చేశాను. ఆయన వట్టిఅనుమానపు మనిషి లెండి. ఎవడైనా మొగాణ్ణి ఖర్మంజాలక తలెత్తిచూసేసరికి పురవిప్పిన త్రాచులాగయి పోతాడాయన. ఇది క్రమంగా ముదిరి, నాకువచ్చే ఉత్తరాలు కూడా విప్పిచూడడం మొదలెట్టేసరికి, నాకు వొళ్ళుమండి, లేచివొచ్చేశాను. ఇలాంటి మనిషిని కట్టుకుని ఏంసుఖపడతానో మీరేచెప్పండి" అంది.

ఇక, ఇదేవిధంగా వెళ్ళనిచ్చి నట్టయితే చివరికి తనని పెళ్ళాడమంటుందేమోనని భయం వేసింది గోపాలరావుకి. అంచేత అతను ఊకొట్టకుండా త్వరగా వదల్చుకు దామనే ఉద్దేశంతో "నేను మీకు కాఫీతయారు చేసుకువస్తాను." అనిచెప్పి వంటయింట్లోకి వుడాయించాడు. ఆమె మొహమాటంగా 'వద్దువద్దు' అని కేక వేసింది కాస్సేపట్లో వేడివేడికాఫీతో తయారయ్యాడు. ఒక కప్పు ఆమెకిచ్చి, ఒక కప్పు తను పుచ్చుకున్నాడు.

యింతలో బయట అడుగుల చప్పుడు వినిపించింది. బహుశా తన స్నేహితుడు రామారావు వచ్చాడేమో ననుకున్నాడు. కాని ఒకనలభై అయిదేళ్ళ మనిషి లోపల ప్రవేశించాడు. అతని చొక్కా చిరిగిపోయివుంది. అతని క్రాపు చిందరవందరగా వుంది. అతనికళ్లు త్రాగినవాళ్ళ కళ్ళల్లాగ చింతనిప్పుల్లా, వున్నాయి. అతని

మీసాలూ, గడ్డాలూ, దుబ్బుల్లాగ పెరిగిపోయి, అతనికి శరీరంమీద బొత్తిగా శ్రద్ధలేదని చూపుతోంది. అతన్ని చూడగానే గోపాల్రావుకి గుండెల్లో రాయి పడింది. ఆ ఆగంతకుడు గోపాల్రావుని కాస్సేపు, ఆయువతిని కాస్సేపూ చూడ్డం ఆరంభించాడు.

చివరికి గట్టిగా అరిచాడా ఆగంతకుడు, "ఇంకేం, చాలామంచి ఛాన్సుకొట్టావు" అన్నాడు గోపాల్రావుతో. ఆయువతికేసి తిరిగి, "ఇందుకోసమేనటే మంగళసూత్రం తెంపుకు వచ్చి, వీడితో కులుకుతున్నావ్? నిన్నుఇలాగ అనుభవించనిస్తాననుకున్నావా ఏమటి?" అన్నాడు.

"కాదండీ, మీరుచాలా పొరపాటు పడుతున్నారు. ఆమె నాకుమ్మం ఎదురుగా మూర్ఛపోయింది తిండిలేక. నేనామె నెమ్మదించేవరకూ ఇక్కడ కూర్చోబెట్టాను." అన్నాడుభయంతో గోపాలరావు.

కాని ఆగంతకుడింకా తీక్షదృక్కుల తోనే చూస్తూ, "అవును అదికొత్త నిమ్మదించాక నీతో చేర్చుకున్నావు కదూ? ఆకాఫీలు, ఆముచ్చడించు కోడాలూ, అకులుకులూ..."

ఈ అనుమానపు మనిషిని వదల్చుకోవడమెలాగో గోపాల్రావుకి అర్థంకాలేదు. యింతలో తన స్నేహితుడు రామారావు ప్రవేశించాడు. అతని పెదిమల మీద అంకురించే చిరునవ్వుచూసి గోపాల్రావుకి ప్రాణం లేచివచ్చింది. ఆనందరావుని చూసి ఆఆగంతకుడు ఆయువతిని లెక్కట్టుకు లాక్కుపోయాడు.

కాస్సేపయ్యాక రామారావడిగాడు, "ఎవర్రా, ఆ యువతీమణి?" అని.

గోపాల్రావు సంగతంతా పూసగ్రుచ్చినట్లు చెప్పాడు. రామారావు నవ్వుఎక్కువైంది.

"అయితే నన్నడుగనీకొత్త. నీకీవాళేగా జీతం వచ్చేది?" గోపాల్రావుకి ఇదంతా అయోమయంగా వుంది. తనస్నేహితుడి మనస్సు తన సమస్య మీదలేదు.

"అవునెద్దూ" అన్నాడు.

"అయితే యెవరికైనా తెలుసా నువ్వీవాళ ఒంటరిగా వుంటావని?"

"తెలిసి వుండొచ్చు. బజారు కెళ్ళడానికి మా అవిడ ఒకవారం రోజులముందునించే హంగామా చేసోంది"

రామారావు నవ్వుతూ, "అయితే యితరులకికూడా తెలిసే వుంటుందన్నమాట" అన్నాడు.

రామారావు ఇల్లాగంటూంటే గోపాల్రావుకి ఒళ్ళుమండింది. ఏదో అనబోతూంటే రామారావు అందుకుని "నీపర్సు ఏంకలర్రా?" అని హఠాత్తుగా విషయం మార్చేశాడు.

రామారావు కేమన్నా పిచ్చెక్కిందేమో ననుకున్నాడు గోపాల్రావు కాని కుర్చీకి తగిలించిన కోటు జేబులోంచి, పర్సుతీసి చూశాడు. చూస్తే ఖాళీపర్సు!!

"అహహ! ఆడబ్బు ఆయువతీమణి దగ్గర ఎక్కడో వుంటుందిలే. ఇదంతా వాళ్ళతోడు దొంగతనం. ఇంతకుముందు వీళ్ళిద్దర్నీ జైల్లో చూశాను. మొత్తానికి వాళ్ళటోపీలో పడ్డావురే! అన్నాడు నవ్వుతూ రామారావు.

★

ఆనందవాణి

పోస్టుబాక్సు నెంబరు

1583

— మేనేజరు